15-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - తండ్రిది బిందు స్వరూపము, వారిని యథార్థముగా గుర్తించి స్మృతి చేయండి, ఇదే తెలివైన పని"

ప్రశ్న:- అనంతమైన దృష్టిలో స్వప్నానికి అర్థం ఏమిటి? ఈ ప్రపంచాన్ని స్వప్నతుల్యమైన ప్రపంచము అని ఎందుకు అన్నారు?

జవాబు:- స్వప్నము అనగా గతించిపోయిన విషయము. ఈ ప్రపంచమంతా ఇప్పుడు స్వప్నతుల్యమని అనగా సత్యయుగము నుండి మొదలుకుని కలియుగాంతము వరకు అంతా గతించిపోయింది అని ఇప్పుడు మీకు తెలుసు. మీకు ఇప్పుడు క్షణములో ఈ స్వప్నతుల్యమైన ప్రపంచము యొక్క స్మృతి కలిగింది. మీరు సృష్టి ఆదిమధ్యాంతాలు, మూలవతనము, సూక్ష్మవతనము, స్థూలవతనాల గురించి తెలుసుకుని మాస్టర్ భగవానులుగా అయ్యారు.

పాట:- నా మనస్సు అనే ద్వారములోకి ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓం శాంతి. శివబాబా తమ మధురాతి-మధురమైన పిల్లలకు, చాలాకాలం తర్వాత కలిసిన సాలిగ్రామాలకు కూర్చొని అర్థం చేయిస్తారు. సాలిగ్రామాలే శివబాబాకు పిల్లలవుతారు కదా. వారు మనల్ని చదివిస్తున్నారని, వారి గురించి అంశమాత్రము కూడా ఎవరికీ తెలియదని పిల్లలకు తెలుసు. శివుని మందిరాలలోకి వెళ్తారు కానీ అక్కడ చాలా పెద్ద శివలింగాన్ని చూస్తారు. మా బాబా ఒక బిందువు అని అక్కడ ఎవ్వరూ భావించరు. ఏ పిల్లలైతే శివబాబాను అంత పెద్దగా భావిస్తూ స్మృతి చేస్తారో లేక చేస్తూ ఉండవచ్చో వారు కూడా అమాయకులే, ఎందుకంటే అది కూడా తప్పే. తండ్రి అర్థం చేయిస్తున్నారు - నేను ఒక బిందువును, ఇప్పుడు బిందువును ఎవరైనా ఎలా అర్థం చేసుకోగలరు. కొందరు అఖండ జ్యోతి స్వరూపము లేక ఫలానా అని అంటారు కానీ అది నిజం కాదు, వారు ఒక బిందువు. వారిని స్మృతి చేయడం చాలా కష్టము. ఘడియ-ఘడియ మర్చిపోతారు. భక్తి మార్గములో శివలింగముపై పుష్పాలు అర్పించే లేక పూజించే అలవాటు ఏర్పడింది కావున అదే గుర్తుంటుంది. కానీ మా బాబా బిందు రూపుడు అన్నది ఘడియ-ఘడియ మర్చిపోతారు. మొత్తం డ్రామా అంతటిలోనూ వారి పాత్ర ఏదైతే ఉందో దానిని అభినయిస్తారు. వారు సుఖసాగరుడు, శాంతిసాగరుడు... అంటూ బిందువును ఏమైనా మహిమ చేస్తారా. ఎంత చిన్నని బిందు రూపము.

పిల్లలు - మేము ధ్యానంలో ఎవరిని ఉంచుకోవాలి? అని అడుగుతారు. ఈ విషయాలను వివేకవంతులే అర్థం చేసుకోగలరు. లేదంటే ఆ శివలింగమే గుర్తుకొస్తూ ఉంటుంది. శ్రీకృష్ణుడైతే మంచి రీతిలో బుద్ధిలో కూర్చోగలరు. బాబా అయితే ఒక బిందువు. పాటలో కూడా ఏమంటారంటే - వారిని గుర్తు తెచ్చుకున్నా కూడా గుర్తుకు రారు, మరి వారి ముఖము ఎలా ఉంటుంది? ఇది కూడా అద్భుతము, వారు ఎంత చిన్న బిందువు! జ్ఞాన నాట్యము చేస్తారు. ఇది స్వప్నాల ప్రపంచము అని అంటారు. గతించిపోయిన విషయాన్ని స్వప్నము అని అనడం జరుగుతుంది. స్వప్నతుల్యమైన ప్రపంచం ఏదైతే గతించిపోయిందో, అది మీ బుద్ధిలోకి వస్తుంది. మొత్తం బ్రహ్మాండము, మూలవతనము, సూక్ష్మవతనము, సత్య, త్రేతా, ద్వాపర యుగాలు అంతా స్వప్నము వలే గడిచిపోయింది. ఏదైతే గతించిపోతుందో, అది స్వప్నమైపోయింది. ఇప్పుడు కలియుగము కూడా అంతిమములో ఉంది. ఇది స్వప్నతుల్యమైన ప్రపంచము కదా. అక్కడ హద్దులోని స్వప్నాలు వస్తాయి. మీకు అనంతము బుద్ధిలోకి వస్తుంది. సూర్యవంశీయులు, చంద్రవంశీయులు అందరూ స్వప్నమైపోయారు. దీనిని స్వప్నాల ప్రపంచము అని అంటారు. ఈ రహస్యము పిల్లలైన మీకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. సత్యయుగములో ఎన్ని అపారమైన సుఖాలు ఉండేవి - అవన్నీ గతించిపోయాయి. ఇప్పుడు పిల్లలైన మీ బుద్ధిలో ఆదిమధ్యాంతాల పూర్తి జ్ఞానము ఉంది. ఒక్క తండ్రి స్మృతే ఉండాలి. తండ్రి ఏదైతే అర్థం చేయిస్తారో, అది ఇంకెవ్వరూ అర్థం చేయించలేరు. మీ బుద్ధిలో స్వప్నాల ప్రపంచము ఉంది. ఇది, ఇది గతించిపోయింది - అని బుద్ధికి తెలుస్తుంది కదా. మీకు పై నుండి మొదలుకుని ఆది నుండి అంతిమం వరకూ మొత్తం జ్ఞానమంతా బుద్ధిలో ఉంది. మీరు ఇప్పుడు త్రికాలదర్శులుగా, త్రిలోకీనాథులుగా అయ్యారు. త్రిలోకీనాథులుగా అవ్వడం ద్వారా మీరు భగవంతుని వలే అవుతారు. భగవంతుడు కూర్చొని మీకు శిక్షణను ఇస్తారు. క్షణములో స్వప్నము వస్తుంది కదా. కావున క్షణములో మీకు బీజము మరియు వృక్షము మొత్తమంతా గుర్తుకు రావాలి. బాబా కూడా అంటారు - ఆదిమధ్యాంతాల జ్ఞానము నా వద్ద ఉంది, అందుకే నన్ను జ్ఞానసాగరుడు, నాలెడ్జ్ ఫుల్, అన్నీ తెలిసినవారు అని అంటారు. ప్రతి ఒక్కరి అవస్థ అదే విధముగా ఉంటుంది అని వారికి తెలుసు. నేను కూర్చొని

ఒక్కొక్కరి అవస్థ గురించి ఏమి తెలుసుకుంటాను! కల్పపూర్వము ఏ అవస్థ అయితే ఉందో, ఆ అవస్థలో ఉన్నారు. అది మీకు కూడా తెలుసు. పురుషార్థము చేయించేందుకని బాగా పురుషార్థము చేయండి అని చెప్తారు.

ఇప్పుడు మీరు స్వదర్శన చక్రధారులుగా అవ్వాలి. ఇది, ఇది గతించిపోయింది అని, ఈ విధంగా దేవతలు రాజ్యం చేసేవారు అని, మళ్ళీ వచ్చి రాజ్యం చేస్తారు అని మీకు తెలుసు. భూత, భవిష్యత్, వర్తమానము - వీటిని గుర్తు చేసుకుంటూ ఉంటారు. దీనినే స్వదర్శన చక్రము అని అంటారు. శివలింగాన్ని స్మృతి చేయడం అలవాటైపోయింది. అందుకే బాబాను జ్యోతిర్లింగము అని భావిస్తారు. బిందువు అని చెప్తే తికమకపడతారు. వారు ఆత్మ చిన్నగా ఉంటుందని, పరమాత్మ పెద్దగా ఉంటారని భావిస్తారు. ఈ కలియుగీ ప్రపంచములో ఈ సమయంలో ఎంత ఆడంబరము ఉందో చూడండి, ఇది ఇప్పుడు పిల్లలైన మీకు తెలుసు. దీనిని మాయ ఆడంబరము అని అంటారు. ఇది మాయ ఆర్భాటము. ఇప్పుడు ప్రపంచం ఎంత బాగా తయారయ్యింది అని అంటారు కదా. పెద్ద-పెద్ద మహళ్ళు తయారయ్యాయి. అమెరికాకు ఎంత ఆడంబరము ఉంది! ఎంత ఆకర్షణీయమైన వస్తువులు తయారవుతూ ఉంటాయి. అవన్నీ కేవలం పైపై మెరుగులు కల వస్తువులేనని, అవి ఇప్పుడు అంతమైపోతాయని మనకు తెలుసు. రోజురోజుకు పెద్ద-పెద్ద బిల్డింగులు, ఆనకట్టలు మొదలైనవాటిని ఎలా తయారుచేస్తారంటే, ఇది ఇక పూర్తిగా కొత్త ప్రపంచము వలె అనిపిస్తుంది. మాయావీ పురుషులు కదా. ఇది అసురీ సాంప్రదాయము యొక్క ఆడంబరము. ఇదంతా ఇంద్రజాలము, ఇదంతా ఇప్పుడిక పోయినట్లే. గొప్ప-గొప్ప విజ్ఞాన గర్వితులు ఎవరైతే ఉన్నారో, వారి బుద్ధిలో ఇవన్నీ అంతమైపోతాయి అని ఉంది. వారు ఒకరికొకరు ఎలా చెప్పుకుంటూ ఉంటారంటే - మీరు ఇంటర్ ఫియర్ అవ్వకండి (జోక్యం చేసుకోకండి), లేకపోతే అంతా అంతమైపోతుంది. అమెరికా తనను తాను శక్తివంతముగా భావిస్తుంది, మరి తప్పకుండా ఎదుర్కొనేందుకు రెండవ నంబరులో కూడా ఎవరో ఒకరు ఉంటారు. రెండు పిల్లులు పోట్లాడుకుంటాయి అని అంటూ ఉంటారు. యాదవులు తమ కులాన్ని వినాశనం చేసుకున్నారు, కావున వారిరువురూ రెండు పిల్లులు అయినట్లు. అదే ఇప్పుడు ప్రాక్టికల్ గా జరుగుతోంది.

ఇంతకుముందు కూడా ఈ సమయంలో మీరే జ్ఞానాన్ని తీసుకున్నారు అని, ఇప్పుడు కూడా తీసుకుంటున్నారు అని పిల్లలైన మీకు తెలుసు. తండ్రి వచ్చి మొత్తం జ్ఞానాన్ని అర్థం చేయిస్తారు. తండ్రి బుద్ధిలో ఏ విధముగానైతే ఉందో, అలాగే పిల్లలైన మీ బుద్ధిలో కూడా ఉంది. శివ్ అని బిందువును అంటారు. ఆత్మలో కూడా మొత్తం పాత్ర అంతా ఉంది. సత్యయుగము నుండి మొదలుకుని కలియుగము వరకూ మీది ఆల్రౌండ్ పాత్ర. సత్య, త్రేతా యుగాలలో మీరు ఎప్పుడైతే సుఖాన్ని అనుభవిస్తారో, అప్పుడు ఆ సమయంలో తండ్రి పాత్ర ఏమీ లేదు. తండ్రి అంటారు, నా కన్నా మీ పాత్ర ఎక్కువ ఉంటుంది. మీరు సుఖములో ఉన్నప్పుడు నేను నిర్వాణధామములో ఉంటాను, నా పాత్ర ఏమీ ఉండదు. మీరు ఆల్రౌండ్ పాత్రను అభినయించారు కావున అలసిపోయేది కూడా మీరే, అందుకే కాళ్ళను వత్తారు అని వ్రాయడం జరిగింది. తండ్రి అంటారు - పిల్లలూ, మీరు అలసిపోయి ఉంటారు, మీరు అర్ధకల్పం భక్తి చేసారు, ప్రతి ద్వారములో ఎదురుదెబ్బలు తిన్నారు. భక్తి మార్గములో భ్రమిస్తూ-భ్రమిస్తూ మీరు అలసిపోతారు. అప్పుడు తండ్రి వచ్చి మీకు ప్రతిఫలాన్ని ఇస్తారు, పూజారుల నుండి పూజ్యులుగా చేస్తారు. పూజ్యులుగా ఉన్న మనమే మళ్ళీ పూజారులుగా అయ్యామని మీకు తెలుసు. పరమాత్మయే పూజ్యునిగా, మళ్ళీ పరమాత్మయే పూజారిగా అవుతారు అన్నట్లు కాదు. అలా కాదు, మనమే అలా అవుతాము.

భారత్ యే అవినాశీ ఖండముగా మహిమ చేయబడుతుంది. భారత్ యే శివబాబా జన్మభూమి. జన్మభూమిపైనే మనుష్యులు బలిహారమవుతారు. కాంగ్రెస్ వారు కూడా జన్మభూమి కొరకు ఎంతగా కష్టపడ్డారో చూడండి. విదేశీయులను బయటకు పారద్రోలారు. ఈ జన్మభూమి స్వర్గముగా ఉండేది. తర్వాత పంచ వికారాల రూపీ మాయ వచ్చి మింగేసింది. మనం రావణుడిని చాలా పెద్ద శత్రువుగా భావిస్తాము. అందరికన్నా అత్యంత పెద్ద శత్రువు మాయా రావణుడేనని, అతడే మన రాజ్యాన్ని తినేసాడని ఎవ్వరికీ తెలియదు. మాయ గుప్తముగా ఎలుక వలె ఊదుతుంది, ఆ తర్వాత కొరుకుతూ ఉంటుంది. ఇది ఎవరికీ తెలియడం లేదు కూడా. కొరుకుతూ-కొరుకుతూ పూర్తిగా దివాలా తీయించేసింది. మాయ మన రాజ్య భాగ్యాన్ని దోచేసుకుందని ఎవరికీ తెలియదు. మన శత్రువు ఎవరు, మనం నిరుపేదలుగా ఎలా అయ్యాము అన్నది ఎవరికీ తెలియదు. మాయ పెద్ద ఎలుక - అర్ధకల్పం తింటూ-తింటూ భారత్ ను గవ్వతుల్యముగా చేసేసింది. అది చాలా శక్తివంతమైనది. ఇప్పుడు మళ్ళీ మీరు గుప్తముగా దానిపై విజయం పొందుతున్నారు. మనం గుప్త రీతిలో రాజ్యాన్ని ఎలా తీసుకుంటాము అనేది మీకు తెలుసు. ఏ విధముగా గుప్త రీతిలో పోగొట్టుకున్నారో, మళ్ళీ అదే విధముగా గుప్త రీతిలో తీసుకుంటారు. ఇప్పుడు మళ్ళీ దీనిపై విజయం పొందాలి అని

ఎవరికీ తెలియదు. ఇవి ఎంత సూక్ష్మమైన రహస్యాలు! బాబా సహాయముతో మళ్ళీ మనం రాజ్య భాగ్యాన్ని తీసుకుంటాము. ఇక్కడ చేతులు, కాళ్ళు ఉపయోగించేదేమీ లేదు. గుప్త రీతిలో మనం మన అనంతమైన తండ్రి నుండి వారసత్వాన్ని తీసుకుంటాము, అది అర్ధకల్పం ఉంటుంది. ఆ ఎలుక వంటి మాయ మెల్లమెల్లగా తింటుంది కానీ మీరు ఇప్పుడు రాజ్యాన్ని 21 జన్మల కొరకు ఒకేసారి తీసుకుంటారు. ఇని, ఇన్ని జన్మలు తీసుకున్నారు అని 84 జన్మల రహస్యాన్ని కూడా మీకు అర్థం చేయించడం జరిగింది. సత్యయుగములో మన ఆయువు చాలా ఎక్కువగా ఉండేదని, తర్వాత అపవిత్రులుగా, భోగీలుగా అవ్వడంతో ద్వాపర, కలియుగాలలో 63 జన్మలు తీసుకుంటామని మీకు తెలుసు. ఇది బాబా కూర్చొని అర్థం చేయిస్తారు. కల్ప-కల్పమూ మాయ ఈ విధంగా రాజ్యాన్ని తీసుకుంటుంది, మళ్ళీ మనం దాని నుండి తీసుకుంటాము. ఏ దేశం నుండి వచ్చాము, ఏ దేశంలోకి వెళ్ళాలి... అని పాటలో పాడుతారు కానీ అర్థం చేసుకోరు. ఆత్మ ఏ దేశము నుండి వచ్చింది, ఎందుకు వచ్చింది అనేది మీకు తెలుసు. మొత్తం చక్రమంతా బుద్ధిలో ఉంది. మొత్తం డ్రామా అంతటిలో హీరో, హీరోయిన్ పాత్ర శివబాబాది. శివబాబాతోపాటు పాత్రధారులు ఎవరెవరు ఉన్నారు? మొట్టమొదట బ్రహ్మా, విష్ణు, శంకరులకు జన్మనిస్తారు, ఆ తర్వాత పిల్లలైన మీకు ఇస్తారు. మీరు తండ్రికి సహాయకులుగా ఉన్నారు. తండ్రి తమ పాత్రను అభినయించి తమ ధామంలోకి వెళ్ళిపోతారు, అలాగే సహాయకులైన మిమ్మల్ని కూడా తమతోపాటు ముక్తిధామంలోకి తీసుకువెళ్తారు. మీరు ముక్తిధామంలోకి వెళ్ళి మళ్ళీ జీవన్ముక్తిలోకి వెళ్ళిపోతారు. దీనిని బుద్ధిలో ఎంత బాగా ఉంచుకోవాలి! కావున గతించిపోయిన స్వప్నాల ప్రపంచము ఇదే.

సత్య, త్రేతా యుగాలలో దేవీ-దేవతలు ఉండేవారని, ఇప్పుడు వారు లేరని మీకు తెలుసు. స్వప్నాల ప్రపంచాన్ని ఏ విధముగా బుద్ధిలో ఉంచుకొని కూర్చున్నాము, మొత్తం చక్రమంతా ఏ విధముగా తిరుగుతుంది అంటూ పాటలో ఎంత గుహ్యమైన రహస్యము ఉంది. ఏ జ్ఞానమైతే తండ్రిలో ఉందో, అది మనలో కూడా ఉంది. అనంతమైన తండ్రిలోనే ఈ అనంతమైన జ్ఞానము అంతా ఉంది. ఇది కూడా స్వప్నము వలె అయిపోతుందని పిల్లలకు తెలుసు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన మరియు అర్థం చేయించవలసిన విషయాలు. సత్య, త్రేతాయుగాలలో ఈ విషయాలు ఎవరి బుద్ధిలోనూ ఉండవు. గుహ్యమైన పాయింట్లు లభిస్తూ ఉంటాయి. బుద్ధిలో మొత్తం చక్రమంతా ఉండాలి. భక్తి మార్గం ఏమిటి, అది ఎప్పటి నుండి ప్రారంభమవుతుంది, దీని వలన లాభమేమీ కలుగలేదు. భక్తి చేస్తూ-చేస్తూ నష్టములోకే వచ్చారు. ఇప్పుడు మళ్ళీ మీరు గవ్వ నుండి వజ్రము వలే తయారవుతారు. మాయ గవ్వతుల్యముగా చేస్తుంది. బాబా జ్ఞాన నాట్యాన్ని నేర్పిస్తారు. తర్వాత మీరు అక్కడకు వెళ్ళి నాట్యం చేస్తారు. ఈ విషయాలు చాలా అద్భుతమైనవి మరియు బాగా తెలుసుకోదగినవి. ఇక్కడి ఆచార-వ్యవహారాలు అక్కడ అసలు ఉండవు. అది ఉన్నదే నిర్వికారీ ప్రపంచము. అక్కడ మాయ నామ-రూపాలు కూడా ఉండవు. మొదట మీరు తండ్రిని స్మృతి అయితే చేయండి, వారసత్వాన్ని అయితే తీసుకోండి, ఇకపోతే అక్కడి ఆచార-వ్యవహారాలు ఏవి ఉంటే అవే నడుస్తాయి. అక్కడి ఆచార-వ్యవహారాలు అన్నీ కొత్తగా ఉంటాయి. అక్కడ ఈ ఉత్సవాలు మొదలైనవి ఉండవు. ఇక్కడ ఉదాసీనత ఉంటుంది, అందుకే ఉత్సాహాన్ని కలిగించే ఉత్సవాలను జరుపుతారు. అక్కడ నిత్యమూ ఉత్సవమే. ఏద్చే అవసరమే ఉండదు. ఉత్సవాలు జరుపుకునే విషయమే ఉండదు. సదా మనకు ఉత్సవ రోజులే ఉంటాయి. అక్కడ వివాహాలు కూడా ఎంతో వైభవంగా జరుగుతాయి, కట్న-కానుకలు లభిస్తాయి, దాస-దాసీలు లభిస్తారు. అయితే పండుగలు మొదలైనవాటి అవసరం ఉండదు. ఇవన్నీ సంగమయుగపు పండుగలు, ఇవే భక్తి మార్గములో జరుపుకోబడతాయి. అక్కడైతే ఎల్లప్పుడూ సంతోషాలే సంతోషాలు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్వదర్శన చక్రాన్ని తిప్పుతూ మాయపై గుప్త రీతిలో విజయం పొందాలి. తండ్రి సమానముగా నాలెడ్జ్ ఫుల్ గా అయి ఉండాలి.

2. తండ్రి ఎవరో, ఏ విధముగా ఉన్నారో, వారిని అలా యథార్థముగా బిందు రూపములో తెలుసుకుని స్మృతి చేయాలి. బిందువుగా అయి బిందువైన తండ్రి స్మృతిలో ఉండాలి. భోళాగా అవ్వకూడదు.

వరదానము:- తండ్రి డైరెక్షన్ల అనుసారంగా సేవగా భావిస్తూ ప్రతి కార్యాన్ని చేసే సదా అలసటలేనివారిగా మరియు బంధనముక్తులుగా కండి

ప్రవృత్తిని సేవగా భావించి సంభాళించండి, బంధనముగా భావించి కాదు. తండ్రి - యోగము ద్వారా లెక్కాచారాన్ని సమాప్తము చేసుకోండి అని డైరెక్షన్ ఇచ్చారు. ఇది బంధనము అని అయితే తెలుసు కానీ, క్షణక్షణము అనటము మరియు ఆలోచించటము ద్వారా ఇంకా కఠినమైన బంధనముగా అయిపోతుంది మరియు అంతిమ క్షణములో ఒకవేళ బంధనమే గుర్తు ఉంటే గర్భ జైలులోకి వెళ్ళవలసి ఉంటుంది, అందుకే ఎప్పుడూ మీతో మీరు విసిగిపోవద్దు, ఇరుక్కోవద్దు కూడా మరియు నిస్సహాయులుగా కూడా అవ్వద్దు, ఆటలా భావిస్తూ ప్రతి కార్యాన్ని చేస్తూ వెళ్ళండి, అప్పుడు అలసటలేనివారిగా కూడా ఉంటారు మరియు బంధనముక్తులుగా కూడా అవుతూ ఉంటారు.

స్లోగన్:- భృకుటి కుటీరములో కూర్చుని తపస్వీమూర్తులై ఉండండి - ఇదే అంతర్ముఖత.